క్లుప్తంగా

## లాభాల వాటా పంచండి..



వినతిపత్రం అందిస్తున్న రామారావు

పాల్వంచ: ఐదేళ్ల నుంచి కేటీపీఎస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పాలకవర్గం సభ్యులు లాభాల వాటాను పంచలేదని, తక్షణం వాటా ఇవ్వాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్142) రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.రామారావు అన్నారు. శుక్రవారం జిల్లా కోఆపరేటివ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. గత పాలకవర్గం నుంచి ముగ్గురితో కమిటీ వేసి, సొసైటీ సభ్యులకు నేరుగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో లాభాల వాట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డి.సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీలో చేరిక



ఏఐటీయూసీలో చేరిన భగీరథ కార్మికులు

ఇల్లెందు: సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల పక్షాన ఏఐటీయూసీ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పలు రంగాల కార్మికులు ఏఐటీయూసీలో చేరుతున్నారని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె.సారయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో 60 మంది మిషన్ భగీరథ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు డి.శంకర్, నజీర్ అహ్మద్, బంధం నాగయ్య, సుందర్‌లు వారికి కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. శ్రీనివాస్, అజయ్‌రెడ్డి, చింతా అజయ్, ఎట్టి శ్రీకాంత్, ఖాజా ఉన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయాలి



ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు శుక్రవారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామని మాట ఇచ్చి ఇప్పటి వరకు ఈ పథకం అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

## నిరుద్యోగ భృతి అందించండి..



మాట్లాడుతున్న రమేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని, రైల్వే రిక్రూట్‌మెంట్‌లో రిటైర్డ్ అయిన వారికి మళ్లీ పోస్టులు ఇచ్చే నిర్ణయాన్ని కేంద్రలో బీజేపీ ప్రభుత్వం, రైల్వేబోర్డు ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. మంచికంటి భవన్‌లో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ సమస్యలపై ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రకటించారు.

## బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

సుజాతనగర్: రెండు ద్విచక్రవాహనాలు ఒక దానికొకటి ఢీకొన్న సంఘటనలో శుక్రవారం ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఉడుముల సీతారామిరెడ్డి బైక్‌పై సుజాతనగర్ నుంచి కొత్తగూడెం వెళ్తున్నాడు. ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వెళ్తున్న మరో బైక్ స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో సీతారామిరెడ్డి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సీతారామిరెడ్డికి తలకు తీవ్ర గాయాలు కాగా, వైద్య చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# నిధులున్నా అభివృద్ధి సున్నా..

- మండలానికి ఫ్లడ్ డ్యామేజ్ నిధులు రూ.12.60 లక్షలు మంజూరు
- పంచాయతీలలో తీర్మానాలు జరగక మరమ్మతుల్లో జాప్యం
- పట్టించుకోని అధికారులు



దెబ్బతిన్న నాగారం - తోగ్గూడెం రోడ్డు

పాల్వంచరూరల్: వర్షాకాలంలో భారీవర్షాల కారణంగా రహదార్లు, కల్వర్టు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దెబ్బతిన రోడ్డు, కల్వర్టు నిర్మాణం, మరమ్మతుల కోసం ఫ్లడ్ డ్యామేజ్ ఫండ్స్ కింద కలెక్టర్ నిధులు మంజూరు చేసి మూడు నెలలు గడిచినా పనుల్లో పురోగతి లేదు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని 36గ్రామ పంచాయతీ పరిధిలో ఆగస్టులో కురిసిన భారీవర్షాలకు పలు గ్రామాలలో రోడ్లు, కల్వర్టులు కోతకు గురై రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి.

**దెబ్బతిన్న రహదారులు...**

జగన్నాథపురం నుంచి సోములగూడెం వెళ్లే రహదారి, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి సోములగూడెం రోడ్డు, దంతలబోరు హరిజన వాడ నుంచి దేవగుంపు రహదారి, బస్వతారక కాలనీ, లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీల నడుమ కల్వర్టు, కేశవాపురం గ్రామంలో అంతర్గత రహదారి, ఉల్వనూరులోని పీహెచ్‌సీ కాంపౌండ్ వాల్, జగన్నాథపురం నుంచి తోగ్గూడెం, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తోగ్గూడెం ప్రధాన రహదారి, నాగారం నుంచి తోగ్గూడెం రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాండురంగాపురం తండా నుంచి ఇల్లెందులపాడు తండా వెళ్లే మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది.

**నిధులు మంజూరు...**

మూడు నెలల క్రితం భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల నిర్మాణం కోసం కలెక్టర్ ఫ్లడ్ డ్యామేజ్ ఫండ్స్ కింద 8 పనులకు గాను రూ.12.60లక్షలు మంజూరు చేశారు. ఇట్టి పనులను పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

**గ్రామపంచాయతీలో జాప్యం..**

ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న గ్రామ పంచాయతీలలో పనులు నిర్వహించాలంటే ముందుగా గ్రామసభను ఏర్పాటు చేసి తీర్మానాలు చేయాల్సి ఉండగా... ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగా జాప్యం జరుగుతుంది.

**గ్రామాల్లో ఆధిపత్య పోరు...**

దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల నిర్మాణం స్థానికులకు కాంట్రాక్ట్ ఇచ్చే విషయంలో స్థానికంగా ఇటు ఎమ్మెల్యే పార్టీ, అటు అధికార పార్టీలకు చెందిన నాయకుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా కరవమంటే కప్పకు, విడవమంటే పాముకు కోపం చందంగా పరిస్థితి మారింది. దీంతో అధికారులకు



హరిజనవాడ నుంచి దేవగుంపు రోడ్డులో కొట్టుకపోయిన కల్వర్టు

గ్రామసభలో తీర్మానంచేసి ఏ వర్గానికి పని అప్పగిస్తే మరోవర్గం అధికారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో అధికారులు పనులు తీర్మానం చేయకుండా దాటవేస్తున్న పరిస్థితి నెలకొంది.

### వెంటనే పనులు చేపట్టాలి...



రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు నిర్వహించేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేస్తే, పనుల నిర్వహణ కోసం తీర్మానాలు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారు. పాండురంగాపురం తండానుంచి ఇల్లెందుల పాడుతండా మార్గంలో రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది.

– అజ్మీర జగదీష్, పాండురంగాపురం తండా

### ఆ తర్వాతే తీర్మానం..



ఎఫ్‌డీఆర్ ఫండ్స్ కింద మంజూరైన పనులు ఎవరికి ఇవ్వాలన్నా ఎమ్మెల్యే పేర్లను సూచించిన తర్వాతనే తీర్మానం చేస్తున్నారు. గతంలో బస్వతారక కాలనీ పంచాయతీలో పంచాయతీ అధికారులు తీర్మానం చేసి ఆమోదించి పనులు కేటాయిస్తే పెద్ద గొడవ జరిగింది.

– బి.నారాయణ, ఎంపీటీ

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం పట్టణ పరిధిలోని వివిధ గ్రామాలు, బస్తీల నుంచి వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నుంచి సుమారు ఐదువందల మంది ఎమ్మెల్యే సమక్షంలో సీపీఐలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ... పేదప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సీపీఐ అన్నారు. సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వంద సంవత్సరాలైనా చెక్కుచెదరకుండా అజేయంగా నిలుస్తుందన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాదన్నారు. ప్రజలకు సేవలందించేందుకు పురుడు పోసుకున్న పార్టీకి ప్రజాప్రతినిధులుగా పనిచేయడం అదృష్టంగా భావించాలని వ్యాఖ్యానించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐకి ఎదురులేదని, ప్రజలకు అందించిన సేవల ఫలితమేనని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా శ్రమిస్తానని హామీ ఇచ్చారు. వివిధ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు చల్లా శకుంతల, చల్లా భాస్కర్, మోహనరావు, ఇమ్రాన్, జమాల్, తేజ, శశి, యాకూబ్‌పాషా, జమీల్, భానోత్ పద్మ, వడ్లూరి రాజారామ్, రమాదేవి, వీరన్న, సురేష్, భావ్‌సింగ్, బోడ శ్రీను, జబ్బర్‌సింగ్, కొత్తూరు నారాయణ, కట్ట నాగయ్య, పులిచెర్ల విధ్వనాథం, సడియం వెంకన్నల నేతృత్వంలో పలు కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, జిల్లా నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా దస్రు, జి.వీరస్వామి, వంగా వెంకట్, గెద్దాడ నగేష్, జక్కుల రాములు, ధనలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కులగణనను శాస్త్రీయంగా చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: కులగణనను శాస్త్రీయంగా చేపట్టి నేతగానిల జనాభా ప్రాతిపదికన 'ఈ'అనే ప్రత్యేక క్యాటగిరీ చేర్చాలని లేదా ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ శుక్రవారం మండలంలోని నేతగాని కులస్తులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసీలతో కలిసి జీవనం సాగిస్తున్నామని గుర్తుచేశారు. కానీ నేటికీ ఎటువంటి రిజర్వేషన్ ఫలాలు అందక పేదరికంలోనే మగ్గుతున్నామని వాపోయారు. భవిష్యత్‌లోనైనా జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు పునఃపంపిణీ జరిగేలా చూడాలని, ఏజెన్సీలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న నేతగాని కులస్తులకు పోడుపట్టాలు మంజూరు చేయాలన్నారు. గతంలో మాదిరిగా పహణీలతో బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, వివిధ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రామటెంకి నాగమల్లయ్య, రామటెంకి అంజయ్య, అశోక్, నర్సయ్య, అనిల్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందులో 29,774 కుటుంబాలు నమోదు**

సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో ఇల్లెందు మండల, పట్టణ పరిధిలో 29,774 కుటుంబాలు నమోదయ్యాయని తహసీల్దార్ కోట రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం నియమించబడిన ఎన్యూమరేటర్లు మూడు రోజులపాటు ప్రతీ ఇంటిని సందర్శించి కుటుంబాల గుర్తింపు ప్రక్రియ చేపట్టారని తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 11,107 కుటుంబాలు, మండలంలో 18,667 కుటుంబాలు నమోదయ్యాయని చెప్పారు. సర్వే పూర్తయిన ప్రతీ ఇంటికి గుర్తింపు పోస్టర్‌ను అతికించామని పేర్కొన్నారు. శుక్రవారంతో కుటుంబాల గుర్తింపు సర్వే ముగిసినందున ఇంకా ఎవరి ఇంటికైనా అధికారులు రాకుంటే గ్రామాలకు సంబంధించిన వారైతే గ్రామపంచాయతీ కార్యాలయంలో, పట్టణంలో అయితే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి తమ కుటుంబాన్ని నమోదు చేయించుకోవాలని సూచించారు. శనివారం నుంచి ఇంటింటి వివరాల సేకరణ ప్రారంభమవుతుందని, దీనికోసం ప్రజలు ముందుగా చెప్పిన సమాచారంతో సిద్ధంగా ఉండాలని కోరారు.

# అంగన్‌వాడీల సమస్యలపై మంత్రికి వినతి..



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆమెను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ గోనెమణి పలు సమస్యలను మంత్రి సీతక్కకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలని, అంగన్‌వాడీ మినీ టీచర్లకు ప్రమోషన్ జీతాలు రావడం లేదని, పెండింగ్‌లో ఉన్న ఈవెంట్, గ్యాస్ బిల్లులు రావడం లేదని పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ను తక్షణమే చెల్లించాలని, యూనిఫాం నాణ్యమైనవి అందజేయాలని వాటితో పాటు పలు సమస్యలను వివరించారు. తమ సమస్యలకు సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు సుజాత, ఖమ్మం జిల్లా నాయకురాలు హుస్నాలతో పాటు పలువురు అంగన్‌వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం రామవరం, చుంచుపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సుజాతనగర్: సుజాతనగర్ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని సుజాతనగర్, సీతంపేట, సీతంపేట బంజర, నిమ్మలగూడెం, సింగభూపాలెం, పాతఅంజనాపురం, కొత్తఅంజనాపురం, జామ్లాతండా, స్టేషన్ బేతంపూడి, మేడేపల్లి తదితర గ్రామాల్లో నేటి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేష్



నియామక పత్రం అందిస్తున్న ప్రసాద్ నాయక్

పాల్వంచ: సేవాలాల్ బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా భట్టు సురేష్ నాయక్ నియామకమయ్యారు. శుక్రవారం స్థానిక సేవాలాల్ బంజారా సంఘ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భట్టు అశోక్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లావుడ్యా ప్రసాద్ నాయక్ సురేష్ నాయక్‌కు నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భూక్యా రవినాయక్, భట్టు అశోక్ నాయక్, శివ నాయక్, జగదీష్, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు సమయం కేటాయించండి..



మాట్లాడుతున్న ఐటీడీఓ పీఓ రాహుల్

సుజాతనగర్: విద్యార్థులు సమయానికి అధిక ప్రాధాన్యం ఇస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఐటీడీఓ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సెమినార్‌లో మాట్లాడుతూ... విద్యార్థులు చదువుకు సమయాన్ని కేటాయిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. తాను పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివానని, ఇంటర్మీడియట్‌లో కష్టపడి చదవడం ద్వారా ఎన్ఐటీ వరంగల్లులో సీట్ సాధించి అనంతరం సివిల్స్‌లో మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించినట్లు చెప్పారు. రాబోయే మూడు నెలల్లో ఐటీడీఏ ద్వారా ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని, రామాలయానికి వచ్చే భక్తులతో పాటుగా విద్యార్థులకు అది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆ తర్వాత కళాశాల ఆవరణలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎన్వీ రమణ, కళాశాల సెక్రటరీ చావా లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బూడిద తరలింపునకు అవకాశం ఇవ్వండి..



ధర్నా చేస్తున్న గిరిజనులు

పాల్వంచ: కేటీపీఎస్ నుంచి బూడిద తరలింపునకు ఐటీడీఏ అధికారులు ఎంపిక చేసిన వారికి వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తు శుక్రవారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... కాలుష్య ప్రాంతాలకు చెందిన గిరిజనులను యాష్ తరలింపునకు ఐటీడీఏ అధికారులు ఎంపిక చేసిన 39 మందికి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరలింపులో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఆందోళన బాట పట్టినా అధికారుల్లో చలనం లేక పోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ధర్మసోతు చందర్, సీతారాం, కృష్ణ, అశోక్, సంజయ్,రవి, సునీత, వంశీ, కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సురారం గ్రామాలకు చెందిన స్థానికులు పాల్గొన్నారు.

## టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

పాల్వంచ: టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చారుగుండ్ల రమేష్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో రిథమ్ కన్వెన్షన్‌లో టీఆర్‌వీకేఎస్ సీఈసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ ఎంపిక పట్ల రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, కమలాకర్, యూసఫ్, అజీబ్, ప్రభాకర్, రఘోత్తం, డి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, ధర్మపురి నాగేశ్వరరావు, నాదెళ్ల రవికుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది అని పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం సీఎం పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. అనంతరం ప్రభుత్వాస్పత్రుల్లో బ్రెడ్డు, పాలు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, తదితరులు



జూలూరుపాడులో ...

# విద్యుత్ సరఫరా చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం ప్రాంతంలోని ఖబరస్తాన్‌లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఖబరస్తాన్, ఈద్గా అధ్యక్షుడు ఫహీందాదా అన్నారు. విద్యుత్ సరఫరా కల్పించాలని శుక్రవారం విద్యుత్ ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చీకట్లో వెళ్లాలంటే విషకీటకాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో అంత్యక్రియలు జరపాలంటే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రసూల్‌పాషా, షమీఉద్దీన్, ఖయ్యూం, జావిద్, అంకుష్, గౌస్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో ఏఎన్ఎంల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ప్రతీనెల ఐదుగురు గర్భిణులను నమోదు చేయకుంటే మెమో ఇస్తూ అధికారులు వేధిస్తున్నారని, జిల్లాస్థాయి మెడికల్ అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో రెండేళ్లుగా బిల్లులు అందడం లేదని, శ్రమదోపిడీకి గురవుతున్నామని నినాదాలు చేశారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్ ధర్నా వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రసాద్, జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున్, నాయకులు ఎండీ యూసుఫ్, బానోత్ ప్రియాంక, పార్వతి, బాలనాగమ్మ, పద్మజ, ఇందిర, అరుణ, సుమలత, రాములమ్మ, జ్యోతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్

### మందుబాబులకు అడ్డాగా బస్టాప్

టేకులపల్లి మండలం రోళ్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద ప్రధాన రహదారి పక్కన ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాప్ మందుబాబులకు అడ్డాగా మారింది. సుమారు పదేళ్ల క్రితమే దీనిని నిర్మించారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రయాణికులు కూర్చున్నది లేదు. బస్సు ఇక్కడ ఆగిందీ లేదు. దీంతో మందుబాబులకు షెల్టర్‌గా మారింది. ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్టాప్‌ని వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి




ప్రశ్నించాల్సిన అధికారి పేరు జి.రవీంద్రరావు
ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్‌నెంబర్: 92814 79238